# అలుగుటయే భరించని...



**అలిగే** ఆడవాళ్ళంటే రాజాకు కోపం. అందుకే సావిత్రిమీద అంత కోపం వచ్చింది.

అసలు పెళ్ళినాడే తను చెప్పాడు – " నాతో ఏదైనా సరే ఫ్రాంక్‌గా మాట్లాడు, నాదేదైనా పొరబాటు ఉంటే స్పష్టంగా చెప్పేయ్! అంతేకానీ, చెప్పేది వినిపించుకోకుండా, సినిమాల్లోలా అపార్థాలు పెంచుకుని నీ జీవితం దుర్భరం చేసుకుని, నాజీవితాన్ని రంపపు కోత పెట్టకు. ఒకరి నొకరు అర్థం చేసుకుని మెలగడమే సంసారం. అలకలతో సాధిద్దామని ఎన్నడూ చూడకు. నాకు అస్సలు ఇష్టం ఉండదు!" అని.

అంత ఇదిగా చెప్పడానికి కారణం ఉంది. తన అన్నయ్య కృష్ణ సంసారం చూసి ఉన్నాడు కాబట్టి అలిగే ఆడవాళ్లు వేసే వేషాలు తనకి బాగా తెలుసు. కాలేజీ చదువుకి పట్నంలో అన్నయ్య ఇంటి దగ్గర ఉన్నప్పుడు చూశాడు వదిన చేసే హడావిడి. ఒకటే గది. మధ్యలో దుప్పటి వేళ్లాడేసి ఓ పక్క తనూ, మరో పక్క వాళ్లూ పడుకునేవాళ్లు. ఎందుకోగానీ, "వంటింట్లో పడుకుంటే ఇంతోటి పసివాణ్ణి పందికొక్కులు ఎత్తుకుపోవు" అని తనని ఉద్దేశించి వదిన అస్తమానూ గొణుగుతూండేది. ఇక ఆదివారం మధ్యాహ్నం చూడాలి, ఏదో గొడవ పెట్టేది. అన్నయ్యకు బతిమాలడం సరిపోయేది. అది చూడలేక తను బయటికి పోయేవాడు. తమాషా ఏమిటంటే తను సాయంత్రం ఏ ఎనిమిది గంటలకో ఇల్లు చేరేటప్పటికి ఇద్దరూ కులాసాగా కూర్చుని కబుర్లు చెబుతూండేవారు. 'సిగ్గు లేని మనుషులు!' అని విసుక్కునేవాడు తను.

ఎమ్బీయస్ ప్రసాద్

రాజా పెళ్లయి రెండు నెలలయింది. తను చాలా న్యాయంగా భార్య ముచ్చట్లన్నీ తీరుస్తున్నాడు. ఎవడిని జడ్జిమెంటుకి పిలిచినా ఆ విషయం ఒప్పుకుని తీరతాడు. కానీ అలిగే ముందు సావిత్రికి ఆ విషయం తోస్తేగా! తను సినిమాకి తీసుకెళతాను రెడీగా వుండమన్నాడు. తీసుకెళ్లే ఉద్దేశం లేకపోతే ఎందుకు ఉండమంటాడు? ఆపాటి ఆలోచన ఉండలా అక్కర్లేదా? ఆలస్యమైంది. నిజమే, బస్సు డ్రైవరు, సైక్లిస్టు కొట్టుకుంటారని తను కలగన్నాడా? ఈ విషయం చెప్పబోతే సావిత్రి వింటేకదా! ఇంటికొచ్చేసరికి మొహం మాడ్చేసుకుని బట్టలు మార్చేసుకుని కూర్చుంది. – "ఏముందీ జీవితంలో ఓ సరదానా, పాడా!" అంటూ, తను చెప్పబోతే అసలు వినిపించుకోదే! తనకి ఒళ్లు మండిందంటే మండదూ!?

అవాళ రాత్రి విడిగా వచ్చేసి హాలులో నేలమీద పడుకున్నప్పుడు తనదేమైనా పొరబాటు ఉందా అని కాగితంమీద అన్ని పాయింట్లూ రాసి చూసుకున్నాడు. ఎలా చూసినా తనే కరెక్టు. ఇక ఆమె అలగవలసిన అవసరం ఏముంది, తన గొప్పతనం చూపించుకోడానికి కాకపోతే. తన లోపమేమీ లేనప్పుడు తను బతిమాలవలసిన అవసరం ఏమీ లేదు. అందుకే రెండురోజులైనా తను మెత్తబడలేదు. సావిత్రి కూడా మెత్తబడలేదు. వంట వండడం, మాట్లాడకుండా వడ్డించడం, మిగతా టైములో పుస్తకం చదువుకుంటూ కూచోడం.. రాత్రి మాత్రం పెందరాళే మంచం ఎక్కి పవళించడం.

తనకి రెండురోజులుగా కింద పడుకోవడంతో ఒళ్లు నొప్పులు చేసినట్టుంది. అయినా ఆవిడ మంచం ఎక్కి పడుకున్నప్పుడు తను మాత్రం ఎందుకు కింద పడుకోవాలి? ఆ మంచం అత్తారు ఇచ్చినది తమ ఇద్దరి కోసం. తను వెర్రివాడిలా కింద పడుకోవడం ఏమిటి, ఆవిడ టింగురంగామని మంచంమీద దొర్లడమేమిటి? కోపం వచ్చిన మొదటిరోజే తను కింద పడుకోకుండా ఉండాల్సింది. ఇప్పుడు మంచం ఎక్కితే తన మీద మోహంతో పక్కకి చేరాడనుకుంటుందేమో! నాన్సెన్స్! తను అంత వీక్ ఫెలో కాదని ఈ పాటికే గ్రహించి ఉంటుంది. అయినా వేరే గదిలో పడుకుని కాదు, పక్కపక్కన పడుకుని నిగ్రహం చూపించినప్పుడే తన తడాఖా ఏమిటో తెలిసివస్తుంది.

రాజా మంచం ఎక్కడానికి రావడంతో సావిత్రి పక్కకు జరిగింది. చదువుతున్న పుస్తకం మూసేసి, లైటు ఆర్పేసి కళ్లు మూసుకుని, నుదిటిమీద చెయ్యి పెట్టుకుని వెల్లకిలా పడుకుంది. కష్టపడి ఆవలించి, తనకూ నిద్ర వస్తోందని సూచించాడు రాజా. అటు తిరిగి పక్కకు ఒత్తిగిల్లాడు. పెళ్లికాని క్రితం ఏళ్ల తరబడి ఒంటరిగా పడుకున్నప్పుడు హాయిగా నిద్రపట్టేది. అదేమిటో రెండు నెలల సహచర్యంతోనే ఒంటికి మరో ఒళ్లు తగలకపోతే అదోలా, వెలితిగా ఉంది. కానీ అలా అని రాజీపడితే అమె అహంకారాన్ని పెంచినట్టువుతుంది. జీవితమంతా సావిత్రి అలకలు తీర్చడంతోనే సరిపోతుంది. నిగ్రహం చూపించాల్సింది ఇప్పుడే. రేపు ఆఫీసులో చెయాల్సిన పని గురించి ఆలోచిస్తుంటే సరి, నిద్రపడుతుంది.

రాత్రి పన్నెండు దాటుతున్నా రాజాకు నిద్ర పట్టలేదు. పట్టదని అతనికి తెలిసి పోయింది. తిరిగి చూస్తే వెల్లకితలా పడుకుని సావిత్రి ఫానుకేసి చూస్తూ కనబడింది. 'ఈవిడకేం, రాత్రంతా నిద్ర లేకపోయినా పరవాలేదు. మధ్యాహ్నం లాగించేస్తుంది. తనలా ఆఫీసు కెళ్లాల్సి ఉంటేగా? తనకే బాధ! శరీరానికి ఒకటి అలవాటు చేశాక నిద్ర రమ్మంటే ఎలా వస్తుంది? తప్పు గ్రహించి ఆమె తన దగ్గరకి వస్తే ఎంత బాగుండేది? అనవసరంగా అలిగి రెండు రోజులుగా మూడ్ ఖరాబు చేసినందుకు ఏమీ అనకుండా క్షమించేవాడు. కానీ, తన తప్పు గ్రహించిన లక్షణాలేమీ అమెలో కనబడటంలేదు. ఫాన్ కేసి చూస్తే ఏముంటుంది? తనలోకి తను చూసుకోవాలి కానీ! అంటే నైట్‌గౌన్లోంచి కనబరిచే ఒంపుసొంపుల్ని కాదు. వాటి వెనకనున్న అంతరంగాన్ని చూసుకోవాలి, సమీక్షించుకోవాలి.

తను కదిలాడు " అబ్బ! దోమలు!" అంటూ ఆమెమీదుగా చేయి వేసి మస్కిటో రిపెల్లర్ స్విచ్ వేయబోయాడు. అదే సమయానికి ఆమె దిండు సర్దుకోడానికి కాబోలు లేచింది. తన చేతికి ఆమె వక్షం తగిలింది. కరెంటు షాక్ కొట్టినట్టు వెనక్కి లాక్కున్నాడు. తను వ్యామోహం కొద్దీ చేయి వేశానని పొరబడలేదు కదా! అంతకన్నా అవమానం ఉందా? వెధవ రిపెల్లర్! ఈ హడావిడిలో స్విచ్ సరిగా

పడనేలేదు. సరిగ్గా వేద్దామని చేయి మళ్ళీ సారిస్తే!? 'అందుకనే' అని రూఢిగా అనుకుంటుంది కూడాను. దోమలు కుడితే కుట్టనీ, చేయి ఛస్తే చాపకూడదు.

అయినా.... తన చేతికి తగిలింది ..... కవుల వర్ణనలో 'శిలలవలె కఠినము' అని వర్ణిస్తారేమో, కొంతమంది 'పూలగుత్తి' అని కూడా అంటారేమో, రెండు నెలలుగా సంసారం చేస్తూ తను సరిగ్గా తెలుసుకోలేక పోవడమేమిటి, ఈ సారేనా సరిగా గమనించాలి. పైనుంచి చూస్తే తెలియటం లేదు. మరీ శ్రద్ధగా చూస్తుంటే పసిగట్టేసిందేమో, అటు తిరిగి ఒత్తిగిలి పడుకుంది. జఘనం ఒంపులు మాత్రం స్పష్టంగా కనబడుతున్నాయి. వక్షం, జఘనం ఒకలాటివేనంటూ లంకె పెడతారు కదా! చేయి వేసి చూస్తే తెలిసిపోతుంది. అయినా చేయి వేసి చూసే హక్కు తనకి ఉంది, భర్త... అంతే తాళి కట్టినవాడు, తిండి పెట్టడానికి పనికివస్తాడు కానీ మీద చెయ్యి వేయడానికి పనికిరాడా? పంతానికి పోవడం వల్ల మన హక్కు మనమే కోల్పోతున్నామన్నమాట! షియర్ ఫూలిష్‌నెస్!

అయినా సావిత్రి అలా అనుకోకపోవచ్చు. లొంగిపోయాడనుకోవచ్చు. అందుకని ఏదో కారణం చెప్పి... రాజా ఆలోచన సాగుతుండగానే అతని ప్రమేయం లేకుండానే అతని అరచేయి ఆమె పిరుదులమీద పడింది. చరిచింది అనవచ్చు. "దోమ!" అన్నాడు రాజా. 'దోమను చంపడానికి చెయ్యి వేశానే కానీ అదేం చిత్రమో, తన ప్రయత్నం లేకుండా చేయి అలా అతుక్కుపోయిందేమిటి? దానిపై సావిత్రి చేయి పడడం వల్లనా..?, అదేమిటి, అలా ముందుకు జారిపోతుందేమిటి? శాటిన్ నైట్ గౌన్ వల్లనా, 'దోమో, ప్రేమో' అంటూ సావిత్రి చేయి గుంజుకుకోవడం వల్లనా?' రాజా ఆలోచనలు ముందుకు సాగడానికి అతని బుర్ర సహకరించలేదు. తలలోకి రక్తం పైకి ఎగజిమ్మి నట్టనిపించింది. మూతపడుతున్న కళ్లపై ఎవరో తెరలు దించినట్టయింది. గొంతు తడారింది. దాహం వేసింది.

మర్నాడు పొద్దున్న లేచి అద్దంలో మొహం చూసుకున్నప్పుడు రాజాకి వాళ్ల అన్నయ్య మొఖంలో ఆదివారం రాత్రి కనబడే వెలుగు తన మొహంలోనూ కనబడింది.

●

(ఆంధ్రప్రభ వీక్లీ నవంబరు 1997)

# ఆలూమగలీయం

## కన్ఫెషన్ - కన్సెషన్

దక్షిణాఫ్రికా క్రికెట్ టీము కెప్టెన్ క్రోనే
ఒప్పుకోలుతో మాచ్ ఫిక్సింగ్ బట్టబయలు - వార్త

"ఈ క్రోనే ఎవడండీ బాబూ? అలా ఒప్పేసుకున్నాడు! కాస్త వెనకా ముందూ చూడద్దూ..."

"ఏమిటి చూడాలంటావ్? వెనకా ముందూ... తను చేసినది తప్పు అని గ్రహించేడు. చెప్పేసాడు."

"ఏడిసినట్టుంది. చెప్పేసి పాపభారం దింపేసుకున్నాడు. కానీ తక్కినవాళ్లని ఇరకాటంలో పెట్టినట్టవలేదూ.."

"చూడు సావిత్రీ. అలా ఒప్పుకున్నందుకు మనం అతన్ని అభినందించాలి గానీ తప్పుబట్టకూడదు."

"అలా ఒప్పుకుంటే మన ఇండియాలో హర్షిస్తానంటారా?"

"మనవాళ్లెక్కడ ఒప్పుకుంటారు? వాళ్లే కాదు, వాళ్లని విచారించిన వాళ్లు సైతం అంతే. చంద్రచూడ్ చూడు. రిపోర్టు బయటపెట్టేస్తానంటూ ఆయన చేసిన హడావుడి చూడు."

"చివరికి బయటపెట్టారుగా. అది పరిశోధనో, గిరిశోధనో తెలియలేదు."

"గిరిశోధనేమిటి మధ్యలో?"

"కొండను తవ్వి ఎలుకను పట్టడం గిరిశోధనట. ఎక్కడో విన్నాను."

"ఇదీ ఇలాగే ఉందిలే. మనోజ్ ప్రభాకర్ పేర్లు బయటపెట్టలేదంటాడు ఈయన. నన్ను అడగనే లేదంటాడు ఆయన..."

"నన్నడిగితే మనోజ్ ప్రభాకర్ పిచ్చిపని చేసాడండి. అతనూ డబ్బు కాస్తయినా పుచ్చేసుకుని తప్పు చేసానొహోయ్ అని దండోరా వేసి ఉండాల్సింది."


"అలా అయితే కాదనడం అన్న సమస్యే రాదు."

"అంతే కాదు, పరువునష్టం దావా వేస్తారన్న భయమూ లేదు. తీసుకునేది తన పరువే కాబట్టి."

"అదిగో నువ్వు క్రోనేని వెక్కిరిస్తూ మాట్లాడుతున్నావ్. అసలు నీకు కన్ఫెషన్ అంటే ఏ మాత్రం గౌరవం లేనట్టుంది."

"కొన్ని నిష్ఠుర నిజాలు చెప్పి తన హృదయభారం తగ్గించుకోవచ్చు కానీ ఆ భారం విన్నవాళ్ల మీద పడుతుంది కదా!"

"అలా పడినా భరించడం నేర్చుకోవాలి. 'టు ఎర్ ఈజ్ హ్యూమన్, టు ఫర్‌గివ్ ఈజ్ డివైన్' అన్నారు."



"కన్ఫెషన్ విన్నవాడు దేవుడు కాదు కదా, మనిషే కదా. తోటి నేరస్థుడు కూడా హర్షించడు. అప్పుడేదో కక్కుర్తి పడినా వీడు తప్పు ఒప్పేసుకుని నన్ను రచ్చ కీడుస్తున్నాడు. అనుకోడూ..."

"అలా అనుకోకూడదు. కన్ఫెషన్ చేసినవాడికి ఈలోకంలోనూ, పరలోకంలోనూ కన్సెషన్ ఇస్తారు. ఒప్పుకున్న తర్వాత క్షమించకపోతే అదో పాపం లాటిదన్నమాట"

"ఒకవేళ మీరే అలాటిది వినాల్సి వచ్చిందనుకోండి. నిజం చెప్పినందుకు మెచ్చుకుని క్షమిస్తారా? లేక అవి తెలియచెప్పి మీకు తలకాయనొప్పి తెచ్చి పెట్టినందుకు చీదరించుకుంటారా?"

"మనమీద అంత గౌరవభావం ఉన్నవాడెవడూ కనబట్టం లేదు. అందుకని ప్రశ్న ఊహాజనితమైనది. జవాబివ్వడం వేస్ట్."

"మీకు ఎవరు గౌరవం ఇచ్చినా ఇవ్వకపోయినా నేనిస్తాను. నేను కన్ఫెస్ చేస్తాను పట్టండి."

"నువ్వు కన్ఫెస్ చేయడం ఏమిటి నా తలకాయ? నువ్వేమైనా క్రికెటర్‌వా ఏమన్నానా? డబ్బు సంపాదించుకోవడానికి అడ్డమార్గాలు తొక్కాలన్నా అర్హతలుండాలి."

"నాకు లేవని మీరనుకుంటున్నారా? సరే మీ ఇష్టం, ఇక వినండి. మీ జేబులో అప్పుడప్పుడు డబ్బులు పోతూ ఉంటాయి చూసారా..."

"కొంపదీసి నువ్వే ఆ డబ్బులు తీస్తూ ఉంటావా?"

"కన్ఫెషన్ పూర్తిగా వినకుండా ఖంగారేమిటంట? ఆ మధ్య నేను కొన్న ఆకుపచ్చ చీర 800లని చెప్పాను కదా, కాదు, అసలు ధర 1800. మీరు ఇంటి వాడకానికి ఇచ్చిన డబ్బులో దాచి..."

"కన్ఫెషన్ వినేవాళ్లు ఇలాటి మాటలు వాడవచ్చా? ఇలా అయితే కన్సెషన్ ఎలా ఇస్తారండి?"

"కన్సెషనా? గాడిదగుడ్డా? ఇంకో మాట మాట్లాడావంటే ఊరుకోను జాగ్రత్త."

"మరి క్రోనేని మెచ్చుకున్నారు?"

"బుద్ధిలేక..."